క్లుప్తంగా

శంకర విద్యాలయానికి బీరువ బహూకరణ



బాపట్ల అర్బన్: వెదుళ్ళపల్లి గ్రామంలోని శంకర విద్యాలయానికి డాక్టర్ రహికిరణ్, వెంకట శ్రీనివాసరావు గురువారం సహృదయ ఫౌండేషన్ ద్వార బీరువాను బహూకరించారు. వేద పాఠశాల యాజమాన్యం వెంకట బొట్టుశర్మ, కొలను మోహన్, పులిగడ్డ రామారావు, గుంటూరు మనోహర ఘనాపాటి విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి: ఐటీఐలో ప్రవేశానికి ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ జి.హుల్దాలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఎలక్ట్రికల్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, మెకానిక్ డీజిల్ కోర్సులకు ఈ నెల 12 నుంచి 31వ తేదీ సాయంత్రం 5గంటల లోపు iti.a p.go-v.i n లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆగస్టు 1న ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 93986 50408, 86482 58622 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఐలవరం ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా కర్రా జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం గురువారం స్థానిక సచివాలయంలో ఉప సర్పంచ్ ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా ఈవోపీఆర్డీ టి.ఊహారాణి వ్యవహరించారు. ఉప సర్పంచ్ పదవికి 11వ వార్డు సభ్యురాలు కర్రా జయశ్రీ పేరును 6వ వార్డు సభ్యుడు సంగా బత్తుని వెంకటేశ్వర్లు ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ ఎన్నికలో 13 మంది వార్డు సభ్యులు పాల్గొన్నారు. 14వ వార్డు సభ్యుడు, ఉప సర్పంచ్‌గా పని చేసిన పప్పల వెంకటేశ్వరరావు ఇటీవల పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప సర్పంచ్‌గా ఎన్నికైన జయశ్రీతో ఈవోపీఆర్డీ ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుగుడు శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ సెక్రటరీ ఎండీ జిక్రియ, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కిన మాజీ సర్పంచ్

భట్టిప్రోలు: స్థల వివాదం పరిష్కరించాలని మాజీ సర్పంచ్ సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే భట్టిప్రోలు మండలం కోనేటిపురం మాజీ సర్పంచ్ జల్లి కుటుంబరావు గురువారం సాయంత్రం సెల్ టవర్ ఎక్కి తన సమస్య పరిష్కరించాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అంబటి చంద్రశేఖర్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, కుటుంబరావుకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. సంబంధిత రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆయన టవర్ దిగారు. దీంతో గ్రామస్తులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఖాజీపాలెం 'జగనన్న సురక్ష' శిబిరం రేపు

పిట్టలవానిపాలెం: ఈ నెల 15న శనివారం ఉదయం 8 గంటలకు ఖాజీపాలెం, పోతన కట్టవారిపాలెం, 18న పిట్టువారిపాలెం, గోకరాజునల్లిబోయినవారిపాలెం, 22న కోమలి, సంగుపాలెం, కోడూరు గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ మారుతి శేషమాంబ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమాలకు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని తెలిపారు.

భట్టిప్రోలు: జగనన్న సురక్ష శిబిరాలు పెదలంక, గొరిగపూడి గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం జరుగుతాయని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వేమూరు: చదలవాడ, చావలి గ్రామ సచివాలయాల్లో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంపులు జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. చదలవాడలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, మండల పంచాయతీ విస్తరణాధికారి సీహెచ్ శేఖర్, చావలి గ్రామ సచివాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దారు నాగరాజు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

చినుకు రాకతో..సిరుల సాగు

ఒకప్పుడు వర్షాలు లేక బీడువారిన మెట్ట భూములు నేడు పచ్చని దుప్పటి కప్పుకుని కళకళలాడుతున్నాయి. మూడేళ్లుగా సకాలంలో పుష్కలంగా వర్షాలు కురుస్తుండటంతో.. ఆ తీర ప్రాంత గ్రామ రెతులు వేరుశనగ సాగుతో అధిక ఆదాయం చూస్తున్నారు. ప్రభుత్వం కూడా అదే తరహాలో పంటకు మద్దతు ధర కల్పించడంతో.. ఏడాదికి రెండు పంటలు పండిస్తూ.. ఎకరాకికి రూ.80వేల వరకు ఆర్జిస్తున్నారు. దీంతో ఒకప్పుడు వర్షపు జల్లు కోసం కళ్ల 'కాయలు' కాచేలా చూసిన మెట్ట రైతులు..ఇప్పుడు సిరుల భాష్పాలను బస్తాలు కట్టుకుని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- ఒకప్పుడు బీడువారిన మెట్ట భూములు
- మూడేళ్ల నుంచి సకాలంలో పుష్కలంగా వర్షాలు
- వేరుశనగ సాగుతో ఆదాయం చూస్తున్న 'దిండి' రైతులు
- 1800 ఎకరాల్లో ఏడాదికి రెండు పంటలు
- ప్రభుత్వం పంటకు మద్దతు కల్పిండంతో ఆనందోత్సాహాలు



దిండిలో వేరుశనగ పంట పొలాలు

నిజాంపట్నం: వేరుశనగ సాగుతో తీర ప్రాంతంలోని రైతుల కళ్లల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. మండలంలోని దిండి పంచాయతీ పరిధిలోని రైతులు మూడేళ్లుగా వేరుశనగ సాగుతో ఆదాయం చూస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 2000 ఎకరాల మెట్టభూమి ఉంది. గతంలో సకాలంలో వర్షాలు లేక పంటలు సరిగా పండని పరిస్థితి. దీంతో రైతులు సాగుకు అంతగా ఆసక్తి చూపకపోవడంతో ఎన్నో ఎకరాలు బీడు భూములుగా మారిపోయాయి. కానీ గత నాలుగేళ్లుగా సకాలంలో పుష్కలంగా వర్షాలు కురుస్తుండటంతో ఏడాదికి రెండు పంటలను రైతులు పండిస్తుండటంతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారింది. పంటలు పండటమే కాకుండా.. ఈ భూములకు భారీగా ధరలు పెరగడంతో రైతుల్లో మరింత ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ప్రస్తుతం దిండి ప్రాంతంలో సుమారు 1800 ఎకరాల్లో రైతులు వేరుశనగ సాగును చేపడుతున్నారు. కొందరు రైతులు పంట వేసి సుమారు 80 రోజులు కావస్తుండటంతో మరో 20 రోజుల్లో కోతలు కోసేందుకు సిద్ధంగా ఉన్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో మెట్ట ప్రాంత రైతులందరూ వేరుశనగ సాగుపైనే మక్కువ చూపుతున్నారు.



కోత దశకు వచ్చిన పంటను చూపుతు ఆనందం వ్యక్తం చేస్తున్న రైతు

పంటకు అందుతున్న గిట్టుబాటు ధర

ఎకరం వేరుశనగ సాగుచేస్తే సుమారు రూ.60వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతోంది. విత్తన కొనుగోలుకు రూ.20వేలు, దుక్కులకు రూ.2వేలు, విత్తుకు రూ.2వేలు, ఎరువులు రూ.15వేలు, కాయలు పీకి సందుకు రూ.12వేలు, కలుపు తీతకు రూ.6వేలు, ఇతర ఖర్చులతో కలిపి ఎకరానికి ఈ మేరకు ఖర్చవుతోంది. ఎకరానికి దిగుబడి 40 బస్తాల వరకు వస్తుండటంతో.. రూ.లక్షకు పైగా రాబడి వస్తోంది. ఇందులో పెట్టుబడి పోనూ రూ.40వేల వరకు ఎకరాకు రైతుకు ఆదాయం వస్తోంది. రెండు పంటలకు ఏడాదికి రూ.80వేల వరకు మిగులుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది వేసవిలో బస్తా రూ.2,850 వరకు ధర పలికిందని, ప్రస్తుతం బస్తాధర రూ.2,600 ఉందని రైతులు తెలుపుతున్నారు. గతంలో బస్తాధర రూ.1800 మాత్రమే ఉండేదని ప్రస్తుత ప్రభుత్వంలో మంచి గిట్టుబాటు ధర లభిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీడు భూములుగా వదిలేశాం..



ఈ ప్రాంతానికి పంట కాలవల వసతి లేదు. కేవలం వర్షంపైనే ఆధారపడి వేరుశనగ సాగును చేస్తుంటాం. గతంలో వర్షాలు లేక పంటలు వేయక పోవడంతో కొంతకాలం భూములు బీడువారిపోయాయి. గత నాలుగేళ్ల నుంచి పుష్కలంగా వర్షాలు పడుతుండటంతో ఇదే ప్రాంతంలో సంవత్సరానికి రెండు పంటు పండిస్తున్నాం. ఎకరానికి 40 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. రైతులం ఎంతో ఆనంగా ఉన్నాం.

బొలగాని బహుద్దూర్, రైతు

మద్దతు ధరతో పెరిగిన ఆదాయం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి వేరుశనగ పంటకు మంచి మద్దతు ధర లభిస్తోంది. గతంలో బస్తా రూ.1800 వరకు మాత్రమే అత్యధికంగా ధరపలికింది. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక బస్తా రూ.2,850 వరకూ ధర పలికింది. ప్రస్తుతం బస్తా రూ.2,600 ఉంది. అంతేకాకుండా ఈ ప్రాతంలో గతంలో ఎకరం రూ.5 నుంచి రూ.6 లక్షల ధర ఉండేది. ప్రస్తుతం పుష్కలంగా పంటలు పండటంతో రూ.15 నుంచి రూ.20లక్షల వరకు డిమాండ్ ఉంది.

కేసన వెంకటరామయ్య, రైతు

ప్రజల వద్దకే పాలన అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే..



యాజలిలో యువకుడికి ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: మండలంలోని గణపవరం, యాజలి గ్రామ సచివాలయాల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రాష్ట్రంలో గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్తోందని, మరో శ్రీలంకగా మారుతుందని ప్రచారం చేసిన మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామని చెప్పటం ఆశ్చర్యంగా ఉందన్నారు. వాలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎమ్మెల్యే మండిపడ్డారు. గతంలో ప్రజలు తమకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా సకాలంలో వచ్చేవి కాదన్నారు. ఇప్పుడు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజల ఇంటికే ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నారని చెప్పారు. సర్పంచ్‌లు నాదెండ్ల భానుప్రసాద్, దేవరకొండ అంకమ్మ, ఎంపీటీసీలు దిండి నాగలక్ష్మి, ఏపూరి నవనీతమ్మ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దారు కేశవ నారాయణరావు, మండల ప్రత్యేకాధికారి బి.స్త్రైదా నాయక్, ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, డీటీ సలీమా, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శులు సునీత, వీరాస్వామిరెడ్డి ఉన్నారు.

అర్హతే ప్రామాణికం..

బాపట్ల అర్బన్ : అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని స్టువర్టుపురం గ్రామంలో జరిగిన 'జగనన్న సురక్ష' శిబిరంలో ఆయన పాల్గొన్నారు. స్టువర్టుపురం గ్రామ సచివాలయంలో 1,428 కుటుంబాలను పూర్తిగా సర్వే నిర్వహించగా, 585 దరఖాస్తులు వచ్చాయి. అందులో 559మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. మూడేళ్లలో గ్రామస్తులకు రూ.10,78,000ల లబ్ధి చేకూరినట్లు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, జేసీఎస్ కన్వీనర్ వడ్డిముక్కల డేవిడ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, సర్పంచ్ బోగిరి ప్రసాద్, ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ, ఈఓపీఆర్డీ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వలివేరులో ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఆర్డీఓ, డీఆర్డీఏ పీడీ



శిరిపూడిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

ఏలేటిపాలెంలో జగనన్న 'సురక్ష'

నగరం: మండలంలోని ఏలేటిపాలెం, శిరిపూడి గ్రామాల్లో జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. ఎంపీపీ చింతల కృష్ణయ్య పాల్గొన్నారు. ఏలేటిపాలెంలో 636, శిరిపూడిలో 733 ధ్రువపత్రాలను అర్జీదారులకు అందజేశారు. తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, గ్రామ సర్పంచ్‌లు పఠాన్‌జాఫర్, ఎం.ఉదయలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రావికంపాడులో ధ్రువపత్రాల అందజేత

కొల్లూరు : మండలంలోని రావికంపాడు, చినపులివర్రు గ్రామ సచివాలయాల వద్ద గురువారం జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. ప్రత్యేకాధికారులు రమణ, రామదాసు, వైస్ ఎంపీపీ మురాలరాంబాబు ధ్రువపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చినపులివర్రులో 535, రావికంపాడులో 465 మంది అర్జీదారులకు ధ్రువపత్రాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దారు ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, ఆర్ఐ త్రివేణి, ఈఓపీఆర్డీ రవికుమార్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అయిల సుబ్బారావు, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మార్పునకు శ్రీకారం

చుండూరు(భట్టిప్రోలు): 'జగనన్న సురక్ష'తో ప్రభుత్వ పాలనలో వినూత్న మార్పునకు శ్రీకారం చుట్టినట్లు ఆర్డీఓ జగన్నాధం పార్థసారథి అన్నారు. చుండూరు మండలం వలివేరులో సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. సచివాలయ పరిధిలో మొత్తం 3,092 ధ్రువీకరణ పత్రాలు అందించారు. డీఆర్‌డీఏ పీడీ బొంతా అర్జున్‌రావు, మండల జేసీఎస్ కన్వీనర్ అన్నపరెడ్డి వీరారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె శివరామకృష్ణారెడ్డి, సర్పంచులు మాచర్ల కోటేశ్వరరావు, మోర్ల విజయలక్ష్మి, ఎంపీపీ జాలాది రూబెన్, జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య, మండల ప్రత్యేక అధికారులు జెన్నమ్మ, పద్మజ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

నిజాంపట్నం: సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీ మోపిదేవి సోదరుడు మోపిదేవి హరనాథ బాబు తెలిపారు. నిజాంపట్నంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, సర్పంచ్ కట్టా పోలేరమ్మ, ఎంపీడీవో నాగలక్ష్మి, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, మోపిదేవి మార్కండేయులు, మోపిదేవి శివనాగరాజు పాల్గొన్నారు.

భావితరాలకు ఆరోగ్యకర వాతావరణం ఇవ్వాలి

తెనాలిరూరల్: భావితరాలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శినారాయణ శర్మ పేర్కొన్నారు. పట్టణంలోని మోరిస్‌పేట ఆర్‌ఆర్ నగర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ, దోమల నివారణపై పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణపై చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమ లార్వాను తినే గాంబూసియా చేపలను పెంచాలని సూచించారు. తడి, పొడి చెత్తగా వేరు చేయడం ద్వారా వాటిని రీసైకిల్ చేసే వీలు కలుగుతుందన్నారు. తాగి పడేసిన కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్, కాగితపు గ్లాసులు దోమల పెరుగుదలకు కేంద్రాలవుతాయని చెప్పారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల హెలన్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. నీటి నిల్వలు లేకుండా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తగాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ బండి విజయ్‌కుమార్, హెల్త్ సెక్రటరీలు రజిని, సునీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వై.లక్ష్మీనారాయణ, శానిటరీ సెక్రటరీ లక్ష్మీప్రసన్న, విజయరాణి, చింపిరయ్య, వెంకటేశ్వర్లు ఫైలేరియా సీనియర్ ఇన్‌స్పెక్టర్ రవి, మలేరియా సిబ్బంది బండారు మల్లేశ్వరరావు, షేక్ రషీద్, నవీన్, రత్నాకర్, బాషిత్ పాల్గొన్నారు. బీసీ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో గాంబూషియా చేపలను వదిలారు.

వైభవంగా శాకంబరి ఉత్సవాలు



రేపల్లె రూరల్: ఆషాఢ మాసం ఏకాదశి సందర్భంగా గ్రామ దేవత శ్రీ బూరుగల్మ దేవాలయంలో గురువారం శాకంబరిదేవి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవతో అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ పసుపు, కుంకుమలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, కూరగాయలతో శాకంబరి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, సద్దినైవేద్యాలు, కూర గాయలు సమర్పించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలు ఆగకూడదు..

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: అర్హత ఉన్న ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఆగకూడదన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. నిజాంపట్నంలోని సచివాలయం–4 పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడారు. గత ఎన్నికల హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నీ అమలు చేశారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధిచేకూరిందో కుటుంబ పెద్దకు వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు తెలిపారు. అదేవిధంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను గ్రామస్తులు ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, సర్పంచ్ కట్టా పోలేరమ్మ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

త్రిపుల్ హ్యాపీ..!

కర్లపాలెం: రాష్ట్రంలోని త్రిపుల్ ఐటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సీట్లు సాధించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి, గురువారం విడుదలైన ఫలితాల్లో సత్తాచాటారు. ఎంపికైన విద్యార్థులను ఆయా మండలాల ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు. మండల పరిధిలోని చింతాయపాలెం, యాజలి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు జి.బాలాజీ, కె.అక్షయ నూజివీడు, ఒంగోలు త్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టి.వెంకటరాజు, జి.రమాదేవి తెలిపారు.

- పెసర్లంక(భట్టిప్రోలు): పెసర్లంక దేవభక్తుని కోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పట్టపు అఖిల ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించింది. విద్యార్థినిని హెచ్‌ఎం ఎస్‌కే మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.
- నగరం: అల్లపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.వైష్ణవి, కె.రిత్విక ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించినట్లు ఎంఈవో కొలసాని హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఎం స్వర్ణలత వారిని అభినందించారు.
- పిట్టలవానిపాలెం: చందోలు నీలి బంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు షేక్ ఖదీర, షేక్ జాస్మిన్ ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు కొల్లిపర మురళీధరరావు తెలిపారు. ఎంపీడీఓ మారుతీ శేషమాంబ, తహసీల్దారు డి.కవిత విద్యార్థులను అభినందించారు.
- రేపల్లె: ట్రిబుల్ ఐటీ ఫలితాల్లో మండలంలోని నలుగురు విద్యార్థులు అర్హత సాధించినట్లు ఎంఈఓ కేసనశెట్టి సురేష్ తెలిపారు. వడ్డీవారిపాలెం, పేటేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు కె.రుహ్యశ్రీ, మలిపెద్ది శ్రావ్య, కొండ హేమంతకుమార్, కె.లోకేష్ అర్హత సాధించినట్లు తెలిపారు.
- నిజాంపట్నం: మండలం నుంచి ట్రిబుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో హరిబాబు తెలిపారు. వారు నిజాంపట్నం, చింకపాలెం, ప్రజ్ఞం జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులని వెల్లడించారు.
- చెరుకుపల్లి: మండలంలోని గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు షేక్ అఫీఫా జాన్(నూజివీడు), దొంతిబోయిన సాంబశివారెడ్డి(ఒంగోలు) ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించినట్లు తెలిపారు. ఎంఈవోలు పి.లాజర్, టి. నవీన్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం కోనేటి కవిత విద్యార్థులను అభినందించారు.

సమన్వయంతో ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారీ



మాట్లాడుతున్న ఆర్డీవో జగన్నాథం పార్థసారథి

రేపల్లె: ఎన్నికల నేపథ్యంలో ఖచ్చితమైన ఓటర్ల జాబితాను ప్రకటించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అన్నారు. పట్టణంలోని సీతారామయోగిని కల్యాణ మండపంలో గురువారం రేపల్లె నియోజకవర్గంలోని నాలుగు మండలాల బీఎల్వోలతో సమావేశంలో నిర్వహించారు. ఓటర్ల జాబితాను ఎలాంటి తప్పులకు తావివ్వకుండా మార్పులు, చేర్పులు చేయాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జులై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించాలని చెప్పారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి ఖచ్చితమైన సమాచారంను సేకరించాలన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చైతన్య పరిచాలన్నారు. ఇంటింటి సర్వేలో ఒకే డోరు నంబరులో అధికంగా ఉన్న ఓట్లను గుర్తించి, మండలస్థాయి అధికారులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

జలమయం



రేపల్లె పద్మావతి టాకీసు సెంటరులో నిలిచిన వర్షపు నీరు



రేపల్లె యానాది నగర్ జలమయం



కొల్లూరులో ముంపునకు గురైన వరి నారుమడి

రేపల్లె రూర/కొల్లూరు: అల్ప పీడన ప్రభావంతో రేపల్లె, కొల్లూరులో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షంతో రేపల్లె పట్టణంలోని పలు రహదారులు, పల్లపు ప్రాంతాలు, మురికి వాడలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారుల్లో మోకాళ్ల లోతుకుపైగా నీరు చేరాయి. పాదచారులు, వాహన చోదకులు అసౌకర్యానికి అయ్యారు. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. కొల్లూరు మండలంలో రహదారులు జలమయం అయ్యాయి. ఆలపాటినగరం, మగ్గాలపాలెం, కొల్లూరులోని పలు ప్రాంతాలోల్లో వర్షపు నీరు గృహాల చుట్టూ చేరింది. నారుమళ్ల వర్షపు నీటి ముంపునకు గురయ్యాయి.

నేడు శాకంబరీదేవిగా అమ్మవారు



పెదకాకాని: శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఏసీ ఎన్. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. భక్తులు సమర్పించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారితో పాటు ఆలయాన్ని నయనానందకరంగా అలంకరించినట్లు చెప్పారు. శాకాంబరీదేవి అలంకరణలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు శుక్రవారం నుంచి ఆదివారం వరకూ దర్శనమిస్తారని వారు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.